

మ్యూజికల్ మ్యూజింగ్స్
- కస్తూరి మురళీకృష్ణ



కాన్హా బజాయే బాన్సురీ

ఔర్ గ్వాలే బజాయే మంజీరే

ఓ గోపియా నాచే ఝుమక్ ఝుం

'నాస్తిక్' సినిమా దేశ విభజన నేపథ్యంలో, ఆ కాలంలో ఆస్తికులకూ, నాస్తికులకూ నడుమ జరిగే సంఘర్షణల నేపథ్యంలో రూపొందించినది. ఆస్తిక దృక్కోణానికి పెద్ద పీట వేసే సినిమా ఇది.

స్వతంత్రం తరువాత హిందీ సినీ పరిశ్రమలో పలు విభేదాలు పొడసూపాయి. ఫలితంగా సినీ పరిశ్రమ జట్లుగా విడిపోయింది. ఈ విడిపోవటం ఎప్పుడూ ప్రత్యక్షంగా లేదు. అంతా పరోక్షమే. ముస్లిం కళాకారులు ఒక జట్టుగా, హిందూ – ముస్లిం తేడా లేదనే కళాకారులు ఒక జట్టుగా, జాతీయ భావాలకు ప్రాధాన్యం ఇచ్చే కళాకారులు ఒక జట్టుగా ఏర్పడ్డారు. అయితే ఈ విభజన ఎన్నడూ ప్రత్యక్షంగా లేదు. ఇటు కళాకారులు అటూ, అటు కళాకారులు ఇటూ, అవసరార్థం పని చేస్తూనే ఉండేవారు. కానీ అధిక శాతం ఎవరి జట్లతో వాళ్లు పనిచేసేవారు.

హిందీ సినీ సాహిత్యంలో 'ఉర్దూ' వాడటానికి ఇష్టపడని గేయ రచయితలుగా కేదార్ శర్మ, భరత్ వ్యాస్, కవి ప్రదీప్‌లు పేరు పొందారు. కేదార శర్మకు అంత పట్టింపు లేదు కానీ కవి ప్రదీప్ కన్నా భరత్ వ్యాస్ అధికంగా 'శుద్ధ హిందీ' శబ్దాలు వాడేవాడు. కానీ వీరి భావనలు జాతీయ భావనలు. భారతీయ సంస్కృతి, సంప్రదాయతత్వాలకు పెద్ద పీట వేశారు. అధికంగా వేదాంత పరమైన పాటలు రాసినవాడు కవి ప్రదీప్. 'నాస్తిక్' సినిమాలో పాటలన్నీ కవి ప్రదీప్ రాసినవే. పాటలన్నీ సూపర్ హిట్లు.

'నాస్తిక్' సినిమా కథ గమ్మత్తయినది. దేశ విభజన సమయంలో తన వారిని కోల్పోయిన హీరోకి దేవుడి మీద నమ్మకం పోతుంది. అవసరమైన సమయంలో మానవత్వం చూపని పూజారిపై కక్ష కడతాడు. అతడిని దెబ్బ తీసేందుకు

అతడి కూతురిని ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. పడవ ప్రమాదంలో అందరికీ దూరమౌతాడు. పూజారి కూతురు శిశువుకు జన్మనిస్తుంది. ఆ పిల్లవాడికి అనారోగ్యం వచ్చినప్పుడు నయమవటం కోసం ఓ సాధువు దగ్గరకు తీసుకు వెళ్తుంది. ఆ సాధువు ఆ వేషంలో ఉన్నది ఆమె నాస్తిక భర్త. తరువాత కథ కొన్ని మలుపులు తిరిగి సుఖాంతమవుతుంది. ఆ కాలంలో పెద్ద హిట్ ఈ సినిమా.

'కాన్హా బజాయే బన్సురీ' పాట ఆనందకరమైన సందర్భంలో నాయిక, ఇతర యువతులతో కలిసి మందిరంలో నృత్యం చేస్తూ పాడే పాట. భజన నృత్యం పాట ఇది. ఈ పాట సింప్లిసిటి ఈ పాట గొప్పతనం. అన్నీ సరళమైన, శుద్ధమైన పదాలే. గొప్ప గొప్ప క్లిష్టమైన తాత్వికాలోచనల ప్రదర్శన లేదు. నృత్యం కూడా సింపుల్‌గా ఉంటుంది. బాణీ అత్యంత మధురంగా, గాలిలో తేనె పూరేకుల మృదుత్వాన్ని, తేలి వచ్చే సుగంధ తరగలను పోలి ఉంటుంది. పాటలో పదాలు చల్లటి, తీయటి కొబ్బరి నీళ్ల రుచిని పోలి ఉంటాయి. పాటలో వర్ణన బృందావనంలో గోపికలు, కృష్ణుడి మురళీ రవానికి నృత్యం చేయటాన్ని వర్ణిస్తుంది. వర్ణన ఎంత సులభంగా, సరళంగా ఉంటుందో అంత గొప్పగా ఉంటుంది. గేయ రచన దృశ్యాన్ని ప్రదర్శిస్తే దర్శకుడి పని సులభమైపోతుంది.

కృష్ణుడు వేణువు వాయిస్తున్నాడు. మంజీరను గొల్ల యువతులు వాయిస్తున్నారు. గోపికలు ఛమ్ ఛమ్ నృత్యం చేస్తున్నారు. ఇక్కడ 'గ్వాలే' అన్న పదం వాడేడు కవి. ఇది పల్లెటూర్లలో పాలు అమ్మే యువతులను సూచించే పదం. 'గోపిక' అని కూడా అర్థం చెప్పుకోవచ్చు. కానీ ఒకసారి గ్వాలే , మరోసారి గోపియా వాడటం వల్ల రెండు పదాల నడుమ తేడా చూపించాడు కవి. కృష్ణుడు మురళి వాయిస్తున్నాడు. పల్లె పడుచులు ఆ లయకు తగ్గట్టు మంజీర మ్రోయిస్తున్నారు. గోపికలు నృత్యం చేస్తున్నారు.

'గ్యాలన్' అన్న పదం అతి ప్రాచీనమైన పదం.

గ్వాలిన్ మేరీ గేంద్ చురాయీ!

ఖేలత్ అన్ పరీ పలకా పర్ అంగియా మాంఝ దురయీ ॥

ఇది సూరదాసు గీతాలలో అత్యంత ప్రాచుర్యం పొందిన గీతం. తాను బంతితో ఆడుతూంటే, మంచమ్మీద పడ్డటు నటించి గోప బాలిక బంతిని ఎత్తుకు పోయిందని అమ్మకు ఫిర్యాదు చేస్తున్నాడు బాల కృష్ణుడు.

మై గ్వాలో రఖవాలో మయ్యా

మాఖన్ నాహి చురాయో

మధుకర్ రాజస్తానీ రచించగా, మహమ్మద్ రఫీ అత్యద్భుతంగా పాడిన భజనగీతం ఇది. 'నేను గోవులను రక్షించేవాడిని అమ్మా, వెన్న దొంగను కాను' అని కృష్ణుడు వాళ్ల అమ్మకు చెప్తున్నాడు. చక్కని పాట. ఈ ప్రయోగాలను బట్టి 'గ్వాలన్' అనటం గోపికలే అని మరింత నొక్కి చెప్పినట్టవుతుందని తెలుస్తుంది.

గోరీ గోరీ హాథోం మే కంగనా ఖన్ కే

చంచల్ పావోంమే దేఖో పైంజనియా ఛన్‌కే

ఢోలక్ ధమాక్ బోలే, ఝూంఝుర్ ఝుమాక్ బోలే

ధూం మచీ హై జమునా తీరే

హో గోపియా నాచే ఝుమక్ – ఝుం

పదాలు చదువుతూంటే పదాలలోంచి లయ తొంగిచూస్తూంటుంది. తెలియకుండానే లయలో చదువుతాం. పైకి చదువుతూంటే వినేవాళ్ల చేతులు తాళం వేస్తాయి అప్రయత్నంగా. అంటే పాటలో పదాలు వాటి బాణీని అవే కూర్చుకున్నట్టుంటాయన్నమాట. కవి ప్రదీప్ గేయ రచన గొప్పతనం ఇది. ఆయన గేయ రచనలోనే బాణీ అంతర్లీనంగా ఒదిగి ఉంటుంది.

మైతో ఆర్తీ ఉతారూరే, సంతోషీ మాతాకీ!

జై జై సంతోషి మాతా జయ్ జయ్ మా!

ఈ పాట తెలియని వారు అరుదు. కవి ప్రదీప్ రాసిన పాట ఇది. 'షోలే' సినిమాను మించి హిట్ అయిన సినిమా 'జై సంతోషీమాత'. ఈ సినిమాతో దేశంలో ఊరూరా, వాడవాడలా సంతోషీమాత గుళ్లు వెలిశాయి. మహిళలు భక్తి ప్రపత్తులతో శుక్రవారాలు 'పులుపు' తినటం మానేశారు. కవి ప్రదీప్ కలం గొప్పతనం అది.

బడి మమతా హై బడా ప్యార్ మా కీ ఆంఖోంమే!

బడీ కరుణా మాయా దులార్ మాకీ ఆంఖోంమే

క్యూన దేఖూ మై బారంబార్ మాకీ ఆంఖోమే!

దిఖే హర్ ఘడీ నయా చమత్కార్ ఆంఖోంమే!

నృత్య్ కరో ఝూం ఝూం, ఛం ఛమా ఛం, ఝూం ఝూం ఝూంకీ నిహారోరే॥

అదే లయ. అదే పవిత్రంగా అనిపించే శుభ్రమైన పదాలు. అతి సులువైన భావనలు. వినగానే మనసుకు పట్టేసే పాట. ఇదీ కవి ప్రదీప్ గేయ రచన సంవిధానం.

ఎలాగయితే 'అమ్మ' కళ్లల్లో దయను, కరుణను సుందరంగా, సరళంగా వర్ణించాడో, అంతకు ఇరవై ఏళ్లముందు కూడా అంత సరళంగా, పవిత్రంగా, అందంగా నృత్యం చేస్తున్న గోపికలను వర్ణించాడు కవి ప్రదీప్. ఆనందంతో ఉర్రూతలూగుతున్న బృందావన పావన ధరిత్రిని వర్ణించాడు.

తెల్లటి వారి చేతులకున్న గాజులు మెరిశాయి. చంచలంగా కదులుతున్న కాళ్లకున్న గజ్జెలు ఘల్లుమన్నాయి. ఢోలక్ మ్రోగింది, జూంఝు మ్రోగింది. యమునా నదీ తీరంలో గోపికలు నృత్యం చేస్తూంటే సర్వం శోభాయమానమైంది. ఆనందం తాండవించింది అంతటా! యమునా నది ఒడ్డున బృందావనంలోని రసమయ రాసలీలను అతి సుందరంగా వర్ణించాడు కవి ప్రదీప్. దృశ్యం కళ్ళ ముందు కనిపిస్తుంది. ఒక సినీ గేయ రచన గొప్పతనం యతి ప్రాసల్లో, భావ ప్రదర్శనలో కాదు, దృశ్యాన్ని చిత్రించటంలో ఉంటుంది. తెరపై జరుగుతున్నదాన్ని పాట ప్రేక్షకుడికి మరింత చేయాలి. అతి తక్కువ మంది సినీ గేయ రచయితలకే ఈ అవగాహన ఉంటుంది.

నా తన్ కా ధ్యాన్ రహా నా మన్ కా ధ్యాన్ రే

ఆజ్ సభీ సుందరియా భూలీ హై భాన్ రే

సఖియోంకే సంగ్ సంగ్ థనక్ రహీ మృదంగ్

పులకిత్ హై అంగ్ అంగ్, మన్ మే ఉఛ్ లే తరంగ్

ఝూం ఝూం కామినియా జైసె హుయీ బావలీ,

బాలోంకీ లట్ ఉల్ ఝీరే

హో గోపియా నాచే ఛుమక్ ఛుం

శుద్ధ హిందీ పదాలలోని లయ, గొప్పతనాలు విస్పష్టమవుతాయి ఈ పాటలో.

హిందీ భాష తెలియని వారికి కూడా వినగానే పాట దాదాపుగా అర్థమైపోతుంది. అక్కడక్కడా పదాలు అర్థంకాకపోవచ్చు కానీ భావం బోధ పడిపోతుంది. తనువుపై ధ్యానం పోయింది. మనస్సు పైనుంచి దృష్టిపోయింది. ఇది సులభంగా అర్థమవుతుంది. 'భూలీ హై భాన్ రే ' చక్కని పద ప్రయోగం. అందరు సుందరీమణులు మైమరచిపోయారు. కానీ వారు ఏం మరచిపోయారు? భాన్. 'భాన్' అన్నది 'బహన్' అన్న పదానికి వ్యావహారికం. అందరూ తమ సోదరిలను మరచిపోయారు. వారికి తనువు మీద ధ్యాసలేదు. మనస్సు ఎక్కడ ఉందో తెలియదు. చివరికి వారికి తమ తోటి వారి ధ్యాస కూడా లేదు. తమ పక్కన ఇతర గోపికలున్నారన్న గ్రహింపు కూడా పోయింది. అంటే, ఎవరికి వారు తమదైన ప్రత్యేక లోకంలోకి వెళ్లి పోయారన్నమాట. మాములు చైతన్య పరిధి దాటి బ్రహ్మానంద స్థితిలోకి వెళ్లిపోయారు గోపికలు, నృత్యం చేస్తూ. వారి ప్రతి అంగం పులకితమైంది. మనస్సులో తరంగాలు విరుచుకు పడ్డాయి. వారు నృత్యం చేస్తూ చేస్తూ పిచ్చి వాళ్లలా అయిపోయారు జుట్టుముడి విడిపోయింది. అయినా వారు సర్వం మరచి నృత్యం చేస్తున్నారు. అద్భుతమైన వర్ణన. భక్తిభావంతో వివశులై భగవత్సాన్నిధ్యంలోని బ్రహ్మానందం అనుభవిస్తున్న వారి అతి మృదువైన వర్ణన ఇది.

సంగీత దర్శకుడు సి. రామచంద్ర ఈ పాటను యమన్ రాగంలో రూపొందించాడు. యమన్ అత్యద్భుతమైన మాధుర్యాన్ని కలిగిస్తుంది. యమునా నది నుంచి వీచే చల్లని వాయు తరగల మాధుర్యం, నదిలో ఎగసిపడే తరంగ మాధుర్యాన్ని ప్రతిబింబిస్తుందీ రాగం. పాటలో కవి ప్రదీప్ ఏవైతే సాంప్రదాయిక వాయిద్యాలను ప్రస్తావించాడో ఆ వాయిద్యాలన్నీ పాటలో వాడాడు సంగీత దర్శకుడు. పియానో మాత్రం పాటలో మెలికలను కలిపేందుకు వాడాడు.

ఛాయా బృందావనమే, ఆజ్ అజబ్ రంగ్ హై

ధర్తీ చక్రారహీహై, ఆస్మాన్ దంగ్ హై

కైసా హై యే కమాల్, దసోదిశాయే నిహాల్

జమునా దేతీ హై తాల్, ఉడ్‌నే లగీ వేధమాల్

ఝూం నే లగీ డాల్ డాల్, థం గయీ పవన్ కీ చాల్

బారా ఘోడోం వాలా సూరజ్ కా రథ్ భీ

చల్నే లగా రే ధీరే ధీరే

హో గోపియా నాచే ఝుమక్ ఝుం

అద్భుతం. పదాలలో దృశ్యం చూపించేశాడు. పాట వినక ముందే బాణీ వినిపించేశాడు. ఇలాంటి గేయ రచనా సంవిధానం అరుదు. బృందావనం నూతన వర్ణంలో ఆశ్చర్యంగా వెలిగిపోయింది. భూమి ఆశ్చర్యపోయింది. ఆకాశం స్థంభించిపోయింది దశదిశలు ఆగి చూస్తున్నాయి. వీరి నృత్యానికి యమునా నది తాళం వేస్తోంది. చెట్లు ఊగుతున్నాయి. గాలి స్థంభించింది. 12 అశ్వాల సూర్యుడి రధం కూడా ఈ అందమైన దృశ్యం చూస్తూ ఆనందిస్తూ వేగం తగ్గించి నెమ్మదిగా ప్రయాణిస్తోంది...

సర్వ ప్రకృతి ఆనందిస్తోంది. సర్వ ప్రకృతి స్థంభించిపోయి వారి నృత్యం చూస్తోంది. సర్వ ప్రకృతి పరవశిస్తోంది. కృష్ణుడు మురళి వాయిస్తున్నాడు. గోపికలు నృత్యం చేస్తున్నారు 'ఆనందం పరమానందం! ఇలాంటి పాటలు వింటూ, చూస్తూ, ఆనందం అనుభవిస్తే ఆనందం అధికమవుతూ బ్రహ్మానందంగా మారుతుంది. ప్రపంచంలో ఆనందం విస్తరింపచేయటానికే కళలు. బ్రహ్మానందం అనుభవింపచేసేదే అసలు కళ. మిగతా అంతా పీడకల.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story